

అమరావతి అశేష జనవాహిని మధ్య స్వామి వార్ల రథోత్సవం

ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి అమరేశ్వరుని లింగోద్భవ అభిషేకాల అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి కల్యాణోత్సవం జరిగింది. ఆలయంలోని స్వామి కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయ ప్రధానాచార్యులు, వేదపండితులు, అర్చకులు కల్యాణాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు జాగారం చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివార్ల తలంబ్రాలను, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గురువారం ఉదయం నూతన దంపతులైన ఉత్సవమూర్తులు హంస, నంది, మిద్దె రథంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దారి పొడవున భక్తులు స్వామి వార్లకు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కీలుగుర్రంపై గ్రామోత్సవంలో విహరించారు.

కమనీయం రథోత్సవం

- భక్తిశ్రద్ధల మధ్య అమరేశ్వరుని రథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన అమరావతి వీధులు
- జాగారం చేసి కల్యాణాన్ని తిలకించిన భక్తులు
- హంస, నంది, మిద్దె రథంపై కల్యాణమూర్తుల గ్రామోత్సవం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జై.. సాంబశివ. శంభో.. శంకర.. శివశంకర.. నామస్మరణలతో అమరావతి వీధులు మారుమోగాయి. భక్తుల జయజయధ్వానాలు.. మంగళవాయిద్యాలు.. డ్రోన్లతో ఆకాశం నుంచి పూల వర్షం కురుస్తుండగా.. వేదమంత్రోశ్చరణల మధ్య గురువారం సాయంత్రం అమరేశ్వరుని రథోత్సవం అమరావతి పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల సమక్షంలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం గురువారం సాయంత్రం దేవతామూర్తుల రథోత్సవం భక్తుల శివనామ స్మరణలతో అంబరాన్ని తాకింది. ముందుగా స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రథశాలకు తీసువచ్చి పూలతో అలంకరించిన రథంపై ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, హరిబాబు, ఈవో సునీల్‌కుమార్ టెంకాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి పురవీధులు కిటకిటలాడాయి. డీఎస్పీలు హనుమంతరావు, వెంకటరమణల పర్యవేక్షణలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాలుగు డ్రోన్ కెమేరాలతో రథోత్సవాన్ని పోలీసులు పర్యవేక్షించారు. కళాకారుల ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు భక్తులను అలరించాయి.



రథోత్సవం ముందు వివిధ వేషధారణల్లో కళాకారులు



నరసరావుపేటలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



మాచర్లలో సెయింట్ ఆన్స్ గరల్స్ హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



గుంటూరులో ఓటు వేస్తున్న అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, లక్ష్మణరావు

పట్టభద్రులు.. ఓటెత్తారు

- 69.57 శాతం పోలింగ్ నమోదు
- గతంలో కంటే 10 శాతంపైగా పెరుగుదల
- తమకే అనుకూలమంటున్న కూటమి నేతలు
- అవన్నీ రిగ్గింగ్ చేసినవేనని పీడీఎఫ్ వర్గాల ఆరోపణ

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులైన దివ్యాంగులు.. గర్భిణులు.. ఉద్యోగులు.. మహిళలు.. ఓటు వేసేందుకు పోటెత్తారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వెల్లివెరిసింది. స్వల్ప తోపులాటలు మినహా ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. విద్యావంతులు అధిక సంఖ్యలో ఉండే గుంటూరు, విజయవాడ లాంటి నగరాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. గంటగంటకు పోలింగ్ పెరుగుతూ వచ్చింది. ఉదయం 10 గంటలకు 11.08 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 29.97 శాతం, 2 గంటలకు 49.06 శాతం, సాయంత్రం 4 గంటలకు 65.58, సమయం ముగిసినప్పటికీ అప్పటికే క్యూలో ఉన్న ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకుని పోలింగ్ ముగిసేసరికి 69.57 శాతానికి చేరుకున్నది. గురువారం ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించడం, ప్రైవేటు కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు ఓటు వేసి ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాలు జారీ.. విద్యా సంస్థలకు సెలవు తదితరాలతో ఓటు వేసేందుకు పట్టభద్రులు పోలింగ్ బూత్‌లకు బారులు తీరారు. ఉదయం 7.30 గంటలకే బూత్‌ల వద్దకు చేరుకుని క్యూలో నిలుచుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. దివ్యాంగులైన పట్టభద్రులు వయస్సు తో సంబంధం లేకుండా పోలింగ్ బూత్‌లకు రావడం విశేషం. మరోవైపు గర్భిణులు, బాలింతలు కూడా వచ్చి ఓటు వేశారు. ఈ కారణంగానే గతంలో కంటే దాదాపుగా 10 శాతం పైగా పోలింగ్ పెరిగింది. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 59.39 శాతం పోలింగ్ నమోదైంది. ఈ దఫా 69.57 శాతానికి పెరిగింది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా దాదాపుగా 77.33 శాతం ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలు మందకొడిగా సాగిన ఓటింగ్ ఆ తర్వాత ఊపందుకుంది. మధ్యాహ్నానికి ఓటర్లు పోలింగ్ స్టేషన్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 4 గంటలకు గడువు ముగిసే సమయానికి కూడా ఓటర్లు క్యూల్లో ఉండడం గమనార్హం. ఆరు జిల్లాల పరిధిలో 483 పోలింగ్ బూత్‌లలో 2,41,502 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దాదాపు లక్షా 5 వేల 634 మంది పోలింగ్ బూత్ ముఖమే చూడలేదు. గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పోలింగ్ ప్రక్రియను అధికారులతో కలిసి రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రత్యేకంగా పరిశీలించారు.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం ఇలా...

జిల్లా పేరు	ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
ఏలూరు	16099	11801	73.30
కృష్ణా	63114	44125	69.91
ఎన్‌టీఆర్	78063	51279	65.59
గుంటూరు	108109	71836	66.45
బాపట్ల	24493	18198	74.30
పల్నాడు	57238	44263	77.33
మొత్తం	347116	241502	69.57

- మొత్తం ఓటర్లు 3,47,116 మంది కాగా 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లున్నారు. వీరిలో పురుషులు 1,48,506 మంది, మహిళలు 92,994, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఓటు హక్కు కలిగిన పురుషుల్లో 71.93 శాతం, మహిళల్లో 66.13 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సిట్టింగ్ ఎమ్మెల్సీ, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ గుంటూరులో ఓటుహక్కు వినియోగించుకున్నారు.



మాచర్ల పట్టణంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న పట్టభద్రులు

- మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెనాలిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- గుంటూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మద్దతుదారులు ఓటరు స్లిప్పులపై లక్ష్మణరావు ఫొటో ముద్రించి పంపిణీ చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు అందినట్లు ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. తూర్పులోని చలమయ్య కళాశాల వద్ద పీడీఎఫ్ ఏజంట్, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది.
- బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వద్ద గడువు ముగిసిన తర్వాత ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే విషయంలో టీడీపీ,పీడీఎఫ్ వర్గాల మధ్య తోపులాట జరిగింది. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పీడీఎఫ్ మద్దతుదారుడు అనిల్‌పై దాడి చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.


స్ట్రాంగ్‌రూంకు తరలిన బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో సిబ్బంది బ్యాలెట్ బాక్సులకు ఏజంట్ల సమక్షంలో సీళ్లు వేశారు. అనంతరం వాటిని తీసుకుని రూట్‌ల వారీగా తమకు కేటాయించిన వాహనాల్లో ఏసీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలివచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారంలు, పీవో డైరీ వంటివి క్షుణ్ణంగా పరిశీలించి బ్యాలెట్ బాక్సులను స్వీకరించి స్ట్రాంగ్‌రూంకు తరలించారు. పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, ఏలూరు, కృష్ణ జిల్లాల్లో స్థానికంగానే తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా జిల్లాల బ్యాలెట్ బాక్సులను అక్కడ స్వీకరించి వాటన్నింటిని కలిపి గుంటూరు ఏసీ కళాశాలకు తరలించడం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు వచ్చిన తర్వాత ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు స్ట్రాంగ్ రూంలకు చేర్చి సీలు వేస్తామని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

గెలుపుపై ధీమా..

పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం అటు రాజకీయ, ఇటు అధికారవర్గాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. పోలింగ్ శాతం గతంలో ఎన్నడూ లేని విధంగా పెరగడంతో ఎన్‌డీఏ కూటమి నేతలు తమకే అనుకూలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా ఓటింగ్ తమకు అనుకూలంగా జరిగిందని, ఖచ్చితంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు తథ్యంగా ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. తాము పక్కా ప్రణాళికతో పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యేందుకు శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించామని దీంతో ఓటర్ల సంఖ్య పెరిగిందని ఆలపాటి వర్గీయులు చెప్తున్నారు. తమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలన్న ఆకాంక్ష పట్టభద్రుల్లో కనిపించిందంటున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఖచ్చితంగా తమ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే విజేతగా నిలబెడుతుందని చెబుతున్నారు. కాగా ఓటింగ్ శాతం గత మూడు పర్యాయాలు చూసుకుంటే 60 శాతం లోపే ఉండేదని, ఇప్పుడు అదనంగా 10 శాతం పైగా పెరగడానికి కారణం దొంగ ఓట్లు, రిగ్గింగ్, ఏజంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేయడమేనని పీడీఎఫ్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లాలో తమ ఏజంట్లను బూత్‌లలోకి రానీయకుండా ఓట్లు వేసుకున్నారని ఆరోపిస్తున్నారు.

కన్నుల పండువగా లింగోద్భవ అభిషేకాలు



7

కమనీయం.. మల్లేశ్వరుడి కల్యాణం



7



ఉన్నతంగా ఎదగడమే

అసలైన విజయం

ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్ పీటీ ఉష

ప్రభలోత్సవం

- అంగరంగ వైభవంగా కోటయ్య తిరునాళ్ల
- విజయవంతంగా ముగిసిన త్రికోటేశ్వరుని ఉత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 27: కోటయ్య క్షేత్రం ప్రభలతో కనువిందు చేసింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా సాగాయి. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో ప్రభలు కనువిందు చేశాయి. అర్ధరాత్రి జాగరణకు తరలివచ్చిన కోటయ్య భక్తులు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి తరించారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



తిరునాళ్ళలో కాంతులీమతున్న ప్రభలు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తడంతో త్రికూటాద్రి కిటకిటలాడింది. తిరునాళ్లలో 20 భారీ విద్యుత్ ప్రభలు భక్తులకు కనువిందు చేశాయి. ప్రభలపై నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలివచ్చాయి. కోటయ్యస్వామి ఆశీస్సులతో తిరునాళ్ల ఉత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. నాదెండ్ల మండలం అప్పాపురం,అవిశాయపాలెం, చిలకలూరిపేట మండలం పురుషోత్తంపట్నం, కావూరు, కోమటినేనివారిపాలెం, కమ్మవారిపాలెం, యడవల్లి, మద్దిరాల, గోవిందాపురం, బొప్పూడి, నరసరావు పేట మండలం కాకాని, ఉప్పలపాడు, చింతలపాలెం, గురవాయ పాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన భారీ విద్యుత్ ప్రభలు కొండ వద్ద కొలువు దీరాయి.

ఇచ్చిపుచ్చుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ నెలకోసారి సమావేశమై.. పరిస్థితిని సమీక్షించుకుందాం' అని జైన్ ఈ సందర్భంగా సలహా ఇచ్చారు. వరద సమయంలోనూ పోతిరెడ్డిపాడు నుంచి నీటిని ఏపీ వాడుకుందని.. కేసీ కెనాల్ ద్వారా కూడా నీటిని వాడుకుందని గతంలో చేసిన ఆరోపణలనే తెలంగాణ ప్రస్తావించింది. నాగార్జున సాగర్ నుంచీ వాడేసుకుందని తెలిపింది. ఈ వాదనలను ఏపీ తీవ్రంగా ఖండించింది. వరద నీరు సముద్రంలోకి వెళ్తుంటే రాష్ట్రావసరాలకు వాడుకున్నామని పునరుద్ఘాటించింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తీసుకున్నా.. ఆ తర్వాత పై నుంచి వచ్చిన వరద కారణంగా శ్రీశైలం జలాశయం నిండినందున.. 20 టీఎంసీల నష్టం వాటిల్లిందన్న వాదనలోనూ పస లేదంది. శ్రీశైలం, సాగర్‌లలో విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటిని వదిలి సముద్రంపాలు చేసింది తెలంగాణేనని ఆక్షేపించింది. దీంతో చైర్మన్ జోక్యం చేసుకుని.. గతంలో జరిగినవి ఇప్పుడు అప్రస్తుతమన్నారు. ప్రస్తుతం సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఏపీకి వదులుతున్న ఏడు వేల క్యూసెక్కులు.. తెలంగాణ కోసం వదులుతున్న తొమ్మిది టీఎంసీలు.. పంటలను కాపాడుకోవడానికి సరిపోతాయో లేదో ఈఎన్‌సీల స్థాయిలో చర్చించుకోవాలన్నారు. ఉన్న నీటిని పంటలకు సర్దుకోవడం.. తాగునీటి అవసరాలు తీర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, హంద్రీ-నీవా నీటినీ సమీక్షించుకోవాలని సూచించారు. నెల తర్వాత కార్యదర్శుల స్థాయిలో మాట్లాడుకుని.. అవసరాలకు అనుగుణంగా సాగర్‌లో అందుబాటులో ఉన్న జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వాడుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాల నీటల కమిటీ జూన్ వరకు ఏపీకి 55, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమంటూ ఇచ్చిన నివేదికపైనా చర్చించారు. అనంతరం చైర్మన్ సూచన మేరకు ఈఎన్‌సీలు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్ సమావేశమై సుహృద్భావ వాతావరణంలో చర్చించుకున్నారు. పంటల రక్షణకు సాగర్ కుడి కాలువ నుంచి 7 వేల నుంచి 8 వేల క్యూసెక్కులు.. ఎడమ కాలువ నుంచి 7 వేల క్యూసెక్కులను వాడుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలం జలాల వాడకంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చేందుకు అంగీకరించారు.



100 రోజులు.. 1,596 మి. యూనిట్లు

- రికార్డు స్థాయిలో కృష్ణపట్నం మూడో యూనిట్ ఉత్పత్తి
- ఒక్కరోజే 4.949 మిలియన్ యూనిట్లు
- అద్భుతం సృష్టించిన సీలేరు జల కేంద్రం

అమరావతి, సీలేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు రికార్డు స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం మూడో యూనిట్‌లో వంద రోజులుగా నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతూ 1596.30 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించింది. ఇక.. సీలేరు జల విద్యుత్ కేంద్రం 24 గంటల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో 4.949 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసింది. ఇది ఈ కేంద్రం చరిత్రలోనే ఆల్ టైమ్ రికార్డు. ఆ వివరాలను జెన్కో గురువారం వెల్లడించింది. వేసవిలో విద్యుత్తు కొరత రానీయకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు వెల్లడించారు. జెన్కో విద్యుత్తు కేంద్రాలు 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా సగటున 110 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన 123 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం నుంచి తొలిసారిగా 95 మిలియన్ యూనిట్లను ఈ నెల 18న ఉత్పత్తి చేశామని తెలిపారు.

నెలరోజుల ముందుగానే లక్ష్యఛేదన

సీలేరు జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిందని జెన్కో ఈఈ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం 477 మిలియన్ యూనిట్లకు గాను గురువారం (27వ తేదీ) ఉదయం నాటికి 477.644 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం ఇంజనీర్లను, సిబ్బందిని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈలు (ఓ అండ్ ఎం) చిన్న కామేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

కరెంటు కొనుగోలు బకాయి 6,556 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు బకాయిలు రూ.6,556.25 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో గత నెల బకాయిలు రూ.1,873. కోట్లు దానికిముందు రెండు నెలల బకాయిలు రూ.4,653.24 కోట్లు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'ప్రాప్తి' పోర్టల్ వెల్లడించింది. తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని ఏపీపీసీసీని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కోరింది.

డిస్కమ్‌ల బలోపేతానికి సహకారం అందించండి

- సీమలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం నిరంతరం కావాల్సిందేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గురువారం రాష్ట్రాల ఇంధన శాఖల కార్యదర్శులు, మంత్రులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్న గొట్టిపాటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రాయలసీమలో సోలార్, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే కరెంటును రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర సహకారాన్ని కోరగా, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశంలో కార్యాచరణను ప్రకటిస్తామని ఖట్టర్ వెల్లడించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

రెట్రోను అందిస్తున్న సితార



విభిన్న పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న తమిళ హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో'. మే ఒకటిన విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఒకవైపు వరుసగా సినిమాలు నిర్మిస్తూ భారీ విజయాలను అందుకుంటున్న ఈ సంస్థ మరో వైపు పంపిణీరంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో పండగ చేసుకొనేలా 'రెట్రో' విడుదలకు ఈ సంస్థ ప్లాన్ చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న 'రెట్రో'లో పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలో 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'రెట్రో' చిత్రానికి సంబంధించి ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జూన్‌లో వస్తున్న కుబేరుడు



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. ఈ ఏడాది జూన్ 20న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పోస్టర్‌లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా నిలబడి ఒకరిని మరొకరు తీక్షణంగా చూస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది.

విష్ణు నమ్మకమే శివుడి పాత్ర చేయించింది

-అక్షయ్ కుమార్



'శివుడి పాత్ర చేయాలంటూ ఆఫర్ వచ్చినప్పుడు నేను రెండు సార్లు తిరస్కరించాను. కానీ విష్ణు వదల్లేదు. భారతీయ సినీ ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను' అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నాతో ఆ పాత్ర చేయించింది. కన్నప్ప కథ చాలా శక్తిమంతమైంది. విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో నేనూ భాగమవడం గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. డాక్టర్ మోహన్‌బాబు తన తనయుడు విష్ణు మంచుతో ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో నిర్మించిన 'కన్నప్ప' టీజర్‌ను ముంబైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌కుమార్ మాట్లాడారు. హీరో విష్ణు మాట్లాడుతూ 'కన్నప్ప కేవలం నాకు ఓ సినిమా కాదు.. నా జీవన ప్రయాణం. కన్నప్ప కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం ఆనందంగా ఉంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకొన్న టీజర్‌ను మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 25న 'కన్నప్ప' విడుదలవుతుంది' అని చెప్పారు.



పూజా హెగ్డే ప్రత్యేక గీతం

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే నటిస్తున్నారు. ఆమె లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. బుధవారం 'ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి' అంటూ ఓ ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ పోస్టర్ పూజా హెగ్డేదే నంటూ ప్రకటించింది. అయితే, ఈ మూవీలో పూజా హెగ్డే కీలక పాత్రను పోషిస్తున్నారా? లేక స్పెషల్ సాంగ్‌లో నర్తిస్తున్నారా? అనేది తెలియాల్సివుంది. 'జైలర్' సినిమాలో హీరోయిన్ తమన్నా 'కావాలయ్యా' పాట తరహాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ గీతంలో నర్తించేందుకు పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు అభిమానులు భావిస్తున్నారు. ఈ మూవీలో ఆమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఇది పైసా వసూల్ సినిమా

- సందీప్ కిషన్



'మజాకా' చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇది పైసా వసూల్ సినిమా. అందరూ థియేటర్లలోనే చూడండి' అని హీరో సందీప్ కిషన్ కోరారు. ఆయన కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన 'మజాకా' చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. త్రినాథరావు మాట్లాడుతూ 'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం సక్సెస్ అయ్యాం అనిపించింది' అని తెలిపారు.

ఆస్ట్రేలియాలో షూట్ చేశాం

- విరాజ్ రెడ్డి



విరాజ్‌రెడ్డి చీలం కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గార్డ్'. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా విరాజ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ అంతా ఆస్ట్రేలియాలో చేశాం. ఒక సెక్యూరిటీ గార్డ్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా సినిమా ఉండబోతోంది. కథానుసారం అన్ని రకాల ఎమోషన్స్ పలికించడం నటుడిగా నాకు సవాల్ అనిపించింది" అని చెప్పారు.

అప్‌డేట్స్

ఆ వాహనం కథేంటి?



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వి మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 21న విడుదల కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. ఇందులో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనం ప్రేమలో పడిపోతారు. యువతరానికి నచ్చే అంశాలతోపాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు.

తెలుగు తెరకు కొత్త గ్లామర్



టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. 'సర్కార్ నౌకరి ఫేమ్', గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ దర్శకత్వంలో తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తాటి బాలకృష్ణ, నిర్మిస్తున్న చిత్రంలో భైరవి కథానాయికగా పరిచయం అవుతున్నారు. 'ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం ఇది' అని నిర్మాత తాటి బాలకృష్ణ తెలిపారు.

నేర పరిశోధన నేపథ్యంలో



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'అబ్సెషన్'. రాకేశ్ శ్రీపాద దర్శకత్వంలో రవి నాలమ్ నిర్మిస్తున్నారు. గురువారం కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ చేతుల మీదుగా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హరీశ్ వినయ్, వి. ధీరజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనీశ్ రాజ్ దేశ్‌ముఖ్, సినిమాటోగ్రఫీ: వనిధర్‌రెడ్డి


త్రికోటేశ్వర స్వామికి క్షీరాభిషేకం


పెరుగుతో..


నెయ్యితో..


ఫలాలతో ..


ఎండు ఫలాలతో ..


కుంకుమతో..


విభూదితో..


గంధంతో..


విశేష అలంకారంలో త్రికోటేశ్వరుడు

కనులపండువగా లింగోద్భవ అభిషేకాలు

కోటప్పకొండ (నరసరావుపేట) ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు కనులపండువగా, అత్యంత వైభవంగా జరిగాయి. పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, ఎండు ఫలాలు, విభూది, తేనె, పండ్ల రసాలు వివిధ ద్రవ్యాలతో స్వామికి లింగోద్భవ అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాల అనం తరం ప్రభుత్వం తరుపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమర్పించిన పట్టువస్త్రాలను స్వామికి అలంకరించారు. ఆలయ ట్రస్టీ మల్రాజు రామకృష్ణ కొండలరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. మల్లేశ్వరుని కల్యాణం

పెదకాకాని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్యాణం.. కమనీయం... శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. మహాశివరాత్రి పర్వదినమున స్వామి ఏకాదశ ద్రవ్యములతో లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. లింగోద్భవ అభిషేకం, గ్రామోత్సవ సేవలో శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం ప్రత్యేక వేదికపై అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ప్రముఖ కల్యాణ వ్యాఖ్యాత పుల్లాభట్ల వెంకటేశ్వర్లు కల్యాణ వ్యాఖానం చేశారు. భక్తులకు స్వామి వారి కల్యాణ అక్షింతలు, లడ్డూ ప్రసాదంను పంపిణీ చేసినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.


శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

దివ్య రథోత్సవం

పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. నంది వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల ఆదాయం రూ.1.77 కోట్లు

కోటప్పకొండ (నరసరావుపేట), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు దేవస్థానానికి రూ. 1,77,68,918 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు గురువారం తెలిపారు. గత ఏడాది కంటే రూ.14.19 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. గతేడాది రూ.1,63,48,227 ఆదాయం వచ్చింది. దర్శనం, అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.65,01,070, హుండీల ద్వారా రూ. 73,47,918, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.38.16 లక్షలు లభించిందని ఈవో వివరించారు. ఉత్సవ అధికారి చంద్రకుమార్, ఈవో డి.చంద్రశేఖరరావు, దేవదాయ శాఖ అధికారులు శ్రీధర్‌రెడ్డి, టి.సుధాకరరెడ్డి పర్యవేక్షణలో హుండీ ఆదాయ లెక్కింపు జరిగింది.

కంపచెట్లలో శిశువు

● గుంటూరుకు తరలిస్తుండగా 108లో మృతి


కంపచెట్లల్లో పడి ఉన్న పసికందు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తం మరకలు ఆరకముందే ఓ పసికందును కంపచెట్లలో పడేసిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద కంపచెట్లలో ఒళ్లంతా రక్తపు మరకలు, తొలగించని బొడ్డుతో శిశువు ఏడుస్తూ ఉండటంతో, కేకలు విన్న ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే వ్యక్తి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది సాయంతో ఆ పసికందును వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 108 డ్రైవర్ సాంబశివరావు శిశువు పరిస్థితి గమనించి బొల్లాపల్లిలో నివాసం ఉంటున్న ఆయన సతీమణి సరళి సహాయంతో బాలుడి ఒంటిపై ఉన్న రక్తపు మరకలు తుడిసి పలు సేవలు అందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేష్ ప్రైవేటు వైద్యశాలలోని శిశువుని పరిశీలించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలతకు పసికందును అప్పగించారు. ఆమె ప్రైవేటు వైద్యశాల నుంచి గవర్నమెంట్ వైద్యశాలకు శిశువుని తరలించి వైద్యసేవలు అందించారు. వైద్యపరీక్షల అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి బాలునాయక్ సూచనల మేరకు 108 వాహనంలో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో శిశువు మృతి చెందాడు. బాలుడిని కని కంపచెట్లలో పడేసిన కసాయి తల్లి వివరాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఆర్‌వో


ఏసీ కళాశాలలో స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సులను చేరుస్తున్న ప్రక్రియని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ సరళిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఏఆర్‌వో ఎస్‌షేక్ ఖాజావలి నిరంతరం పర్యవేక్షించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలోనే ఉండి పోలింగ్ సరళిని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను వీక్షిస్తూ పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకొన్నారు. ప్రతి జిల్లాకు ఒక అధికారిని కేటాయించి ఆయా జిల్లాల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటూ పోలింగ్ శాతం వివరాలను తెప్పించుకొని ఎన్నికల సంఘానికి నివేదించారు. సాయంత్రం 4 గంటలకు చాలావరకు పోలింగ్ కేంద్రాలు ఖాళీ అయిపోయాయని, కొన్ని చోట్ల మాత్రం క్యూలైన్లలో ఓటర్లు ఉండటంతో వారికి స్లిప్పులు ఇచ్చి ఓటు వేయడానికి అనుమతి ఇచ్చినట్లు ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. గతంలో కంటే పోలింగ్ శాతం గణనీయంగా పెరగడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తాము నిర్వహించిన స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చామన్నారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు వాహనాల్లో తరలిస్తున్నారని, నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు ఏవీ రాలేదని చెప్పారు.



బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలకు తరలించిన ఎన్నికల సిబ్బంది

నేడు రాష్ట్ర బడ్జెట్

● సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపుల పైనే ఆశలు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఏమేరకు కేటాయింపులు చేశారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని గుంటూరు జిల్లాలో ముందుకు తీసుకెళ్లడానికి నిధులు ఎంతో అవసరం. అలానే గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు నిధులు అవసరం ఉంది. ఈ దఫా బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించే అవకాశాలున్నట్లు అంతా అంచనా వేస్తున్నారు. అమరావతి రాజధాని, అవుటర్ రింగురోడ్డు, నూతన రైలుమార్గం ప్రాజెక్టుకు కేంద్రమే నిధులు సమకూరుస్తుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నూతన రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాజధాని రైతులు అమరావతి రాజధానికి కేటాయింపులు బాగుండాలని కోరుకుంటున్నారు. రోడ్లకు కొంతవరకైతే ప్యాచ్‌వర్కులు చేశారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదు. కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్అండ్‌బీ, మున్సిపల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలకు నిధులు కేటాయిస్తేనే పనులు పురోగతిలోకి వస్తాయి.

ఆలపాటి గెలుపు తథ్యం: అనగాని

రేపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం ఎప్పుడో ఖాయమైందనీ, మెజార్టీ ఎంత వస్తుందనేది తేలాల్సి ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. జగన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందన్నారు. అసెంబ్లీకి రావటం జగన్‌రెడ్డికి ఇష్టం లేదనీ, బడుగు, బలహీన వర్గాలపై అతనికి ఎటువంటి ప్రేమలేదని విమర్శించారు. ప్రతిపక్ష హోదా లేకున్నా వెంకయ్య నాయుడు, సుందరయ్యలాంటి నాయకులు ప్రజల కోసం అసెంబ్లీలో పోరాటం చేశారన్నారు. జెమిలి ఎన్నికలే కాదు ఏ ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి ఘన విజయం వస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ఏమీ లేదనీ, ఎవరు చేసిన పాపాలకు వారు అనుభవిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా వ్యక్తిగత దూషణలకు పాల్పడిన పోసాని మురళీ కృష్ణను చట్టపరంగానే అరెస్టు చేశారని అనగాని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లపై వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని పోసాని వినకూడని మాటలు అన్నారని ఆరోపించారు.

లక్షా 5 వేల 614 మంది ఓటింగ్‌కు దూరం

● గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లోనే ఎక్కువ మంది
● ఓటు నమోదుకు ఉత్సాహంగా దరఖాస్తు
● తీరా నమోదైన తర్వాత ఓటు వేయని పట్టభద్రులు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో ఏ విధంగా అయితే ఓటర్లు చైతన్యం ప్రదర్శిస్తారో అలాంటి వాతావరణం ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్‌లో కనిపించలేదు. ఈ నియోజకవర్గంలో ఓటర్లంతా విద్యావంతులే. డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదువులు పూర్తి చేసి మూడేళ్లకు పైగా అనుభవం గడించిన వారే. ఓటు వేయడం అనేది ప్రాథమిక హక్కు. ఈ విషయం పట్టభద్రులందరికీ కొత్తగా చెప్పాల్సిన పని లేదు. అయినప్పటికీ ఓటింగ్‌కు చాలామంది ఈ ఎన్నికల్లో దూరమయ్యారు. ఓటరు నమోదులో చూపించిన ఉత్సాహం పోలింగ్ సందర్భంగా ప్రదర్శించలేకపోయారు. ఓటర్ల సంఖ్య 3,47,116 ఉండగా, వీరిలో కనీసం మూడు లక్షల మంది అయినా ఓటు వేస్తారని అంతా భావించారు. అయితే 2,41,502 మంది మాత్రమే ఓటుహక్కుని వినియోగించుకొన్నారు. లక్షా 8 వేల 109 మంది ఓటర్లు కలిగిన గుంటూరు జిల్లాలో 71836 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొన్నారు. అలానే ఎన్‌టీఆర్ జిల్లాలో 78063 మంది ఓటర్లుంటే 51,279 మంది ఓటు వేశారు. కృష్ణాలో 63114 మంది ఓటర్లుంటే 44125 మంది ఓటు హక్కుని వినియోగించుకొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ ఓటర్లు మరింత ఎక్కువ సంఖ్యలో ఓటు వేసి ఉంటే పోలింగ్ శాతం 75 వరకు చేరుకునేదే.

ఓటు ఇక్కడ... ఉద్యోగం వేరొక చోట

ఓటుహక్కు కలిగిన పట్టభద్రుల్లో చాలామందికి ఓటు ఇక్కడుండగా వాళ్ల ఉద్యోగ, వృత్తిరీత్యా నివాసం ఉంటున్నది వేరే ప్రాంతం కావడం పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కాకపోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఇక్కడి ఓటర్లు పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయడానికి ఇక్కడికి వచ్చేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. కొంతమంది సిబ్బందికి కొన్ని డిపార్టుమెంట్‌లు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయలేదు. ఇది కూడా ఓటింగ్ పెరగకపోవడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు.

అక్రమాలపై విచారణ ప్రారంభం


బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ప్రకాశం మెప్మా పీడీ పి.శ్రీహరి, టీమ్

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మెప్మాలో వెలుగు చూస్తున్న అక్రమాలు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. మెప్మా ఎండీ తేజ్‌భరత్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా మెప్మా పీడీ పి.శ్రీహరిని విచారణాధికారిగా నియమించారు. ఆయనతోపాటు మెప్మాలో పనిచేస్తున్న ఆరుగురు బృందం గురువారం విచారణ ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రుణాలు ఇచ్చేందుకు కొత్త గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చే విషయంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఇప్పటికే పలువురు ఆరోపణలు చేస్తూ మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి ఫిర్యాదులు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఈ నేపథ్యంలో విచారణ బృందం బ్యాంక్‌లకు వెళ్లి ఎన్ని గ్రూపులకు రుణాలిచ్చింది, ఎంతమొత్తం ఇచ్చింది వివరాలు కావాలని కోరారు. అదే విధంగా వేలల్లో రుణాలిచ్చి లక్షల్లో బకాయిలు చూపిస్తున్నారంటూ ఫిర్యాదు చేసిన మేరీ ప్రసన్నకుమారిని పిలిపించి విచారించారు. తనకు కేవలం రూ. 10 వేలు మాత్రమే రుణం ఇచ్చారనీ, ఆ మొత్తం తిరిగి చెల్లించానని చెప్పారు. అయితే ఇంకా బ్యాంక్‌లో తాను సుమారు లక్షా 90 వేల రూపాయలు బకాయి ఉన్నట్లు చూపిస్తున్నారని వాపోయింది. ఈ విషయమై ఆర్పీలను పిలిపించి విచారించగా మేరీ ప్రసన్నకుమారికి ఇచ్చింది రూ. 10 వేలేననీ, మిగిలిన డబ్బులు గ్రూప్‌లీడర్ తీసుకుందని చెప్పారు. ఈ విధంగా గ్రూప్‌లో సభ్యులందరు ఎంతరుణం తీసుకున్నది తెలుసుకునేందుకు వారితో సమావేశం ఏర్పాటు చేయాలన విచారణాధికారి సూచించారు. పీడీ శ్రీహరి మాట్లాడుతూ ఆర్పీ రజియా, షాజిదాలను పిలిపించి విచారించినట్లు తెలిపారు. మేరీ ప్రసన్నకుమారికి రూ. 10 వేలు ఇచ్చి మిగిలిన డబ్బులు గ్రూప్‌లీడర్ కరీమా తీసుకున్నట్లు ఒప్పుకొని లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. ఈ విధంగా గ్రూప్‌లోని సభ్యులందరితో మాట్లాడి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐవీ ఇన్‌గర్సల్‌బాబు, టిఈఎల్‌హెచ్ జయ్‌కుమార్, టీఈలు రాణి, ఫణికుమారి, ఎస్‌పీఎంయూ సునీల్, ఏవో వినీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉన్నతంగా ఎదగడమే అసలైన విజయం

● ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్ పీటీ ఉష
● ఎస్‌ఆర్‌ఎంలో ఘనంగా ఉద్గమ్ జాతీయ క్రీడోత్సవాలు


పీటీ ఉషకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తాము ఎంచుకున్న రంగంలో గొప్పగా రాణించి పతకాలు సాధిస్తే సరిపోదనీ, జీవితంలో ఉన్నతంగా ఎదిగినప్పుడే నిజమైన విజయం సాధించినట్టుని భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు, పద్మశ్రీ పీటీ ఉష అన్నారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఉద్గమ్-25 జాతీయ క్రీడోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీటీ ఉష క్రీడా జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత ఉంటేనే ఏ రంగంలోనైనా రాణించగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. క్రీడలతో విద్యార్థుల్లో సంఘటిత శక్తి పెరుగుతుందన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి క్రీడల్లో ప్రతిభ చూపడం వల్లనే తాను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నానని చెప్పారు. మంచి నడవడికతో తాము చదువుకున్న విశ్వవిద్యాలయానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. వీసీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఒలింపిక్స్‌లో వర్సిటీ విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అనూప్‌సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ సునీత క్రీడల అభివృద్ధికి ఎస్‌ఆర్‌ఎం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ ఏడాది పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు రెండు వేల మందికి పైగా పాల్గొంటున్నారని తెలిపారు. వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మార్చి ఒకటో తేదీన జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు రూ.పది లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ నుంచి క్రీడల్లో రాణిస్తున్న జెస్సీరాజ్ (స్కేటింగ్), బాలప్రసాద్‌రెడ్డి (రన్నింగ్), ఆకుల హైమలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ వినాయక్, సీఎఫ్ ఏవో సుమ, రీసెర్చ్ డీన్ రంజిత్, డైరెక్టర్ సిద్ధార్థ, రేవతీ బాలకృష్ణ, శ్రీపతి, వంశీ, విద్యార్థి సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం కె.సైమన్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ గతంలో ఉన్న షటిల్ కోర్టులో అనేక సమస్యలు ఉండటం వలన బ్యాడ్మింటన్ పోటీలకు అనువుగా ఉండేది కాదన్నారు. ఇప్పుడు చల్లని గాలి నిర్వహణతో ఎయిర్ వెంటిలేషన్ వ్యవస్థని అభివృద్ధి చేశామని, ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టమ్‌ని మెరుగుపరిచామన్నారు. మోకాలి కుదుపుల విషయంలో ఆటగాళ్ల రక్షణ కోసం కోర్టు మొత్తం తొలగించి సరికొత్త రబ్బర్ కుషన్ టెక్నాలజీతో కలపను అమర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు ఎం.రవీంద్రనాథ్, సీహెచ్ ప్రదీప్‌కుమార్, జేవీ అనూష తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 530.60 అడుగులు ఉంది. ఇది 169.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9076 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1500, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,889 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	83, 90, 100
చికెన్ విత్ స్కిన్	160.00
చికెన్ స్కిన్ లెస్	170.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



నకరికల్లులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, నాగోతు శౌరయ్య

పోలింగ్ ప్రశాంతం..

- ముగిసిన కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు
- అన్ని నియోజక వర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు
- పోలింగ్ కేంద్రాల్లో జిల్లా ఉన్నతాధికారులు, మండల అధికారుల తనిఖీలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మాచర్ల నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. మాచర్ల పట్టణంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటలకే ఓట్లు ప్రక్రియ ప్రారంభమైంది. టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరి చిరుమామిళ్ల మధుబాబు 316 బూత్‌లో తన ఓటును వినియోగించుకున్నారు. మొత్తం ఓట్లు 3055 కాగా 2546 నమోదయ్యాయి. ఇవి 84 శాతంతో సమానం. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను నరసరావుపేటలోని ఎస్ఆర్ కళాశాలకు తరలించారు.

విజయపురిసౌత్ మండలంలోని 343 ఓట్లకు గాను 273 పోలయ్యాయి. 80 శాతం ఓటింగ్ జరిగింది. వెల్దుర్తి మండలంలో మొత్తం 963 ఓట్లకుగాను 808 పోలయ్యాయి. 83.04 శాతం ఓటింగ్ జరిగింది. దుర్గి మండలంలో 974 ఓట్లు ఉండగా 786 ఓట్లు పోలయ్యాయి. 79 శాతం ఓటింగ్ జరిగింది. కారంపూడి మండలంలో 1054 ఓట్లకు గానూ 940 ఓట్లు పోలయ్యాయి. 89 శాతం ఓటింగ్ జరిగింది. రెంటచింతల మండలంలో మొత్తం 832 ఓట్లకు గానూ 736 పోలయ్యాయి. 88.46శాతం ఓటింగ్ జరిగింది.

ఎన్నికలు ప్రశాంతం.. ఎస్పీ శ్రీనివాసరావు..

పల్నాడుజిల్లా పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని సెయింట్ ఆన్స్ గరల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌బూత్‌ను ఆయన పరిశీలించారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ జగదీష్, పట్టణ సీఐ పచ్చిపాళ్ల ప్రభాకర రావు, ఎస్ఐలు రవిబాబు, సంధ్యారాణి, నరసింహ ఉన్నారు.



సత్తెనపల్లి పట్టణంలోని బాలికల జడ్పీ హైస్కూల్లో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే కన్నా

గురజాల నియోజకవర్గంలో..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరిగాయి. నియోజకవర్గం వ్యాప్తంగా గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం మండలాల పరిధిలో వున్న ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల జడ్పీ హైస్కూల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల మండలంలో మొత్తం 2,886 ఓటర్లకు గాను 2563 ఓట్లు పోలయ్యాయి. మాచవరం మండలంలో 809 ఓట్లకు గాను 711 ఓట్లు పోలయ్యాయి. గురజాల మండలంలో 1497 ఓట్లకు గాను 1373 ఓట్లు, దాచేపల్లి మండలంలో 1637 ఓట్లకు గాను 1448 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తంగా 6829 ఓట్లకు గాను 6095 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా 90శాతం ఓటింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు.



మండల కేంద్రం వెల్దుర్తిలో, పిడుగురాళ్ల జడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న పట్టభద్రులు

సత్తెనపల్లి నియోజకవర్గంలో ..

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సత్తెనపల్లి పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూలు, కేంద్రీయ విద్యాలయంలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. సత్తెనపల్లి మండలంలో మొత్తం 5319 మంది ఓటర్లు ఉండగా, 3667 మంది ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. 68.94శాతం ఓటింగ్ జరిగింది.

ఓటు హక్కు వినియోగం ఓటరు బాధ్యత.. ఎమ్మెల్యే కన్నా

ఓటు వేయటమనేది అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్ట భద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల సందర్భంగా గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కన్నా లక్ష్మీనారాయణ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని ఆరు పోలింగ్ కేంద్రాలతో పాటు నియోజకవర్గంలోని ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ మండలంలో 1466 మంది ఓటర్లు ఉండగా 984 ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 67.12 ఓటింగ్‌శాతం నమోదైనట్లు తహసీల్దార్ యం.భవానీ శంకర్ తెలిపారు.

నకరికల్లు,(ఆంధ్రజ్యోతి): నకరికల్లు మండలంలో 1644 ఓట్లకు గాను 1135 ఓట్లు పోలయ్యాయి. 69 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు.

రాజుపాలెం, (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండలంలో మొత్తం 1275 మంది ఓటర్లు ఉండగా, 897 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70శాతం ఓటింగ్ జరిగింది. ఏఎస్పీ జెవి సంతోష్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మన్నెం శివనాగమల్లేశ్వరరావులు విచ్చేసి స్థానిక నేతలతో మాట్లాడారు.

పెదకూరపాడు నియోజకవర్గం..

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా పట్టభద్రులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెదకూరపాడుమండలంలో 1307 మంది ఓటర్లు ఉండగా 1097 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అచ్చంపేట మండలంలో 1484 మందికి గానూ 1253 మంది, అమరావతి మండలంలో 2,136 మందికి గాను 1830 మంది, క్రోసూరు మండలంలో 1534 మందికి గాను 1203 మంది, బెల్లంకొండ మండలంలో 610 మందికి గాను 500 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తంగా 80 శాతానికి పైగా ఓటింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. పెదకూరపాడులో తహసీల్దార్ నీలి ధనలక్ష్మి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే భాష్యం, శ్రీధర్‌లు

ఎన్నికల పోలింగ్ సరళిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు పరిశీలించారు. పెదకూరపాడు జడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రంలో కొమ్మాల పాటి శ్రీధర్, తుళ్ళూరు జడ్పీ హైస్కూలు పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పెదకూరపాడు జడ్పీ హైస్కూల్లో క్యూలో పట్టభద్రులు, ఓటు హక్కు వినియోగించుకుంటున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు జిల్లా తుళ్ళూరు జడ్పీ హైస్కూల్లో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పుల్లరి వ్యతిరేక ఉద్యమ యోధుడు

కన్నెగంటికి నివాళి

రెంటచింతల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్నాటి పుల్లరి వ్యతిరేక ఉద్యమ యోధుడు కన్నెగంటి హనుమంత్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిటీషు వారు 26 రౌండ్లు కాల్పులు జరిపినా ఎదురొడ్డి నిలిచిన ధీశాలి కన్నెగంటి అని అన్నారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, గాదే లూర్దు మర్రెడ్డి,ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కపోతేశ్వరునికి రుద్రహోమం

నకరికల్లు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం చేజర్లలోని కపోతేశ్వర స్వామికి తొలుత శుప్రభాత సేవ చేశారు. అనంతరం రుద్రహోమం నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించారు. బలిహరణ కార్యక్రమాలు చేశారు. పూజా కార్యక్రమాలను కొండకావూరి వెంకట్రామయ్య శర్మ, భువనగిరి కపోతేశ్వర శాస్త్రిలు నిర్వహించారు.

నేడు చేజర్ల కపోతేశ్వర స్వామి తిరునాళ్ళ

ఈనెల 28వ తేదీ శుక్రవారం చేజర్ల కపోతేశ్వర స్వామి తిరునాళ్ళను నిర్వహించనున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి మూడవ రోజు తిరునాళ్ళ నిర్వహణ ఆనవాయితీగా వస్తుంది. ఏర్పాట్లను ఆలయ ఈవో వై వెంకయ్య పర్యవేక్షిస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 30.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 300 క్యూసెక్కుల నీరు స్లూయిజ్‌ల ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

సత్తెనపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సత్తెనపల్లి పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లను ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ఆయన అధికారులతో కలసి పర్యవేక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను కూడా ఆర్డీవో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ చక్రవర్తి ఉన్నారు. మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంపులను నిర్వహించారు. పట్టణ సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ చక్రవర్తి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.



కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి



హుండీ నగదు లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం లెక్కింపు

గురజాలటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో ఉన్న గంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామికి మహా శివరాత్రి సందర్భంగా భక్తులు సమర్పించిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మొత్తంగా రూ. 3,24,493 ఆదాయం సమకూరిందని అలయ అధికారులు తెలిపారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,32,440, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ. 25,700, హుండీ ద్వారా రూ. 1,31,732, డొనేషన్స్ ద్వారా రూ. 34,621లు సమకూరింది. ఈ లెక్కింపును ఈవో కృష్ణంరాజు పర్యవేక్షించారు.

బాధిత కుటుంబానికి

టీడీపీ నేతల ఆర్థికసాయం

కారంపూడి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త అరబోలు వరాలు నివాస గృహం బుధవారం రాత్రి ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు గురువారం బాధితురాలికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు తండా మస్తాన్‌జానీ, తెలుగు మహిళా నాయకురాలు కాటంరెడ్డి నాగలక్ష్మి, మైనార్టీ నేతలు షేక్ నస్సేసా, ఆర్యవైశ్య సంఘ నేతలు ఎస్‌పీఆర్ కృష్ణ, కాసుల శంకర్, బవిరిశెట్టి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నేతలు

భక్తుల సేవలో సేవా సంస్థలు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతి సందర్శించిన వేలాది మంది భక్తులకు పలుసేవా సంస్థలు తమ దాతృత్వాన్ని చాటుకుని భక్తులకు ప్రసాదాలు, పాలు, మజ్జిగ, మంచినీరు అందించారు. సేవలు అందించిన వారిలో అమరలింగేశ్వర కాపు సంఘం, ధరణికోట కాకతీయనగర్‌వాసులు, ఎన్ ఆర్ఐ కర్నాటి సతీష్, నాయబ్రాహ్మణ సేవాసంఘం, శ్రీరామకృష్ణ హిందూహైస్కూల్ పూర్వ విద్యార్థులు, కేసీపీ సిమెంట్ తదితర సేవాసంస్థల వారు ఉన్నారు.



గోవిందరెడ్డిని సన్మానిస్తున్న సేవాశ్రమ సభ్యులు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

మాచర్లరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి తొలగిపోతుందని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకురాలు భారతి అన్నారు. పట్టణంలోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో యోగా మొదటి బ్యాచ్ ముగింపు ఉత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భారతి మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వలన మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. అనంతరం సేవాశ్రమ నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవాశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఇన్‌చార్జి వైద్యాధికారులు అరుణ్, లక్ష్మీప్రసన్న

మాచర్లటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మురికి నీటిలోని దోమల వలన బోధకాలువ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం ఉందని, మురికివాడల్లో జీవిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణంలోని ఆరోగ్య కేంద్రాల ఇన్‌చార్జి వైద్యాధికారులు అరుణ్, లక్ష్మీప్రసన్నలు అన్నారు. గురువారం పట్టణంలోని బోధ వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి డి లక్ష్మయ్య, సూపర్‌వైజర్ టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బోధ వ్యాధి గ్రస్తులకు కిట్లను అందజేస్తున్న వైద్యాధికారులు అరుణ్, లక్ష్మీప్రసన్న



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆలపాటి రాజా విజయం తథ్యం..

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి, సీనియర్ టీడీపీ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాదు గెలుపు తథ్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం క్రోసూరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ సరళిని చూస్తుంటే రాజాకు అత్యధిక మెజార్టీ లభించటం ఖాయన్నారు. ఎనిమిది నెలల కూటమి పాలనలో తమకు ఎంతో మేలు జరుగిందని ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్ట భద్రులు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ రాజేంద్రప్రసాదుకు అనుకూలంగా ఓటు వేయటానికి ఉత్సాహం చూపారన్నారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, తెలుగు మహిళా నాయకురాలు వేగుంట రాణి, టీడీపీ నేతలు కొండవీటి శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, మన్నెం శ్రీనివాసరావు, మొగల్ జాన్, కొడవటి కిషోర్ పాల్గొన్నారు.



స్వామివారి దర్శనం కోసం భక్తులకు క్యూను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రేపటి నుంచి పల్నాటి తిరుమల తిరునాళ్ల

- నాలుగు శనివారాలు, ఉగాది పర్వదినాన ఉత్సవాలు
- రెండో శనివారం స్వామివారి కల్యాణం.. హాజరుకానున్న ఎమ్మెల్యే, ఎంపీలు
- మత్స్యావతార వేంకటేశ్వరస్వామి జాతరకు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు

రాజుపాలెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమల తిరునాళ్లకు ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలో ఎంతో ప్రత్యేకత ఉంది. రాజుపాలెం మండలం లోని దేవరంపాడు కొండపై వేంచేసియున్న మహావిష్ణువు తొలి అవతారమైన మత్స్యావతార స్వయంభువు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది స్వామివారి ఫాల్గుణ మాస ఉత్సవాలు, కల్యాణ మహోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి దేవాదాయశాఖ ఏర్పాట్లు చేస్తుంది. 2014-2019 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ఏడాది నాలుగు శనివారాలలోని ఉత్సవాలతోపాటు ఉగాది పండుగ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు శ్రమిస్తున్నారు. ఈమేరకు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇప్పటికే దేవాదాయశాఖ జిల్లా అధికారి అచ్చుత్‌ను ఉత్సవాలను విజయవంతం చేసేందుకుగాను ప్రత్యేక అధికారిగా నియమించారు.



దేవరంపాడు కొండపై మత్స్యావతార స్వయంభువు వేంకటేశ్వరస్వామి



దేవరంపాడు కొండపై తిరుమల నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించిన వెంకటేశ్వర స్వామి

జిల్లా పండుగగా గుర్తించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు ..

దేవరంపాడు వేంకటేశ్వరస్వామి తిరునాళ్ళ పండుగను జిల్లా పండుగగా గుర్తించాలని చాలా సంవత్సరాల నుంచి డిమాండ్ ఉంది. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావ టంతో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

సామాన్య భక్తులకు ఉచిత దర్శనం.. ఈవో సురేష్

తిరునాళ్లకు వచ్చే సామాన్య భక్తులకు స్వామివారి ఉచిత దర్శనం ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి సురేష్ తెలిపారు. 1వ తేదీ మొదటి శనివారం రోజు వేకుజాము నుంచి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. భక్తులకు తాగునీరు, చలువ పందిళ్లు, తదితర సౌకర్యాలు కల్పించామని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర గాయాలు

- ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడిన వైనం
- గుంటూరు జీజీహెచ్‌కి తరలింపు..

సత్తెనపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : భవనంపై నుంచి జారి పడి భవన నిర్మాణ కార్మికులు ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని 19వ వార్డులో గురువారం జరిగింది. 19వ వార్డులో నిర్మాణం చేస్తున్న గృహంలో 4వ అంతస్థు పైకి వాటర్ ట్యాంక్‌ను తాడు సాయంతో భవన నిర్మాణ కార్మికులు బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలిలు లాగుతుండగా ఒక్కసారిగా వాటర్ ట్యాంక్‌కు కట్టిన తాడు తెగింది. దీంతో వాటర్ ట్యాంక్ పనులు చేస్తున్న కార్మికులు ఇద్దరు అదుపు తప్పి నాల్గవ అంతస్తు నుంచి కింద పడ్డారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, భవన నిర్మాణ దారులు ఇరువురిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.



ప్రమాదంలో గాయపడిన భవన నిర్మాణ కార్మికులు

ఆలపాటి విజయం ఖాయం

బెల్లంకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి విజయం ఖాయమని గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. గురువారం బెల్లంకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆలపాటి రాజేంద్రప్రసాదును గెలిపిస్తుందని తెలిపారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, సయ్యద్ జానీ, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి, ఓర్చు ఆనంద్, ఎన్ పిచ్చయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం

- జాతీయ రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు
- ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారుల ఆందోళన

రెంటచింతల,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : 167 ఏడీ జాతీయ రహదారిని రాత్రి వేళ చీకటి కమ్మేస్తుంది. దీంతో చీకటిలో ప్రయాణం వాహనదారులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. నిత్యం వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన విదు దీపాలు వెలగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. రెంటచింతలకు 5 కి.మీ జాతీయ రహదారి వుంది. దాచేపల్లి నుంచి మాచర్ల వరకు 41 కి.మీ ఉండగా 13 చోట్ల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కానీ కేవలం అలంకార ప్రాయంగా ఉండటంతో రాత్రివేళ రహదారిని చిమ్మ చీకటి ముంచేస్తుందని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణం 95 శాతం పూరైంది. పాలువాయిగేట్‌లోనే ఆర్‌వోబీ (రైల్వేఓవర్ బ్రిడ్జి) నిర్మాణం ఒక్కటే నిలిచిపోయింది. రహదారిపై వీధి దీపాల నిర్వహణ సంబంధిత కాంట్రాక్టరే చూసుకోవాలి. నేషనల్ హైవే నుంచి వాహనాలు వెళ్తున్నప్పటికి దీపాలు ఏర్పాటు చేయడంలో జాప్యం ఏర్పడింది. ఈ విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, ప్రమాదాల బారి నుంచి వాహనదారులను కాపాడాలని కోరుతున్నారు.



విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో చీకటిలో జాతీయ రహదారి


నరసరావుపేటలో ఓటు వేసేందుకు బారులుతీరిన పట్టభద్రులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు


పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఓటు వేసిన అనంతరం సిరా గుర్తును చూపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ కుమార్, ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్సీ ఎన్నికలు పట్టణంలో ప్రశాంతంగా ముగిశాయి. మునిసిపాల్టీకి సంబంధించి పట్టణంలో 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 69.87 శాతం పోలింగ్ నమోదైంది. 3449 పురుషుల ఓట్లు, 2393 మహిళల ఓట్లు ఉన్నాయి. మొత్తం 5842 ఓట్ల ఉండగా 4082 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 2545, మహిళలు 1534మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రముఖులు మునిసిపల్ బాలుర, బాలికల స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, మానవ హక్కుల కమిషన్ మాజీ సభ్యుడు కాకుమాను పెద పేరిరెడ్డి, దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ కుమార్, జనసేన నరసరావుపేట ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌లలో వసతులను మునిసిపాల్టీ ఏర్పాటు చేసింది. కమిషనర్ జస్వంత్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్లలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం పరిశీలించారు.

● వినుకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వినుకొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో వినుకొండ పట్టణంతో పాటు మండలానికి చెందిన బూత్‌లలో పట్టభద్రులు అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 7669 ఓట్లు ఉండగా, మొత్తం 5963ఓట్లు పోలై 77.80 శాతం నమోదైంది. వినుకొండ పట్టణంలో 2952 ఓట్లతో పాటు వినుకొండ మండలంలో 981 ఓట్లకు గాను 71 శాతంకు పైగా పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. బొల్లాపల్లిలో 1079 ఓట్లకు గాను 76శాతం, ఈపూరు 979 ఓట్లకు గాను 93శాతం, నూజెండ్ల 1011 ఓట్లకు గాను 86 శాతం శావల్యాపురం 658ఓట్లకు గాను 93శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తానికి సరాసరి 75శాతం మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు నమోదయ్యాయి. వినుకొండ జూనియర్ కళాశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో మధులత పరిశీలించి ఓటు నమోదు శాతం గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలించి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు ఓటర్లకు కృతజ్ఞతలు తెలియచేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న యువత

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వినుకొండలో యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పది రోజుల క్రితం వైద్యశాలలో సిజేరియన్ చేయించుకున్న వెంకట శివజ్యోతి 11వ రోజు కుట్లు విప్పకముందే తన హక్కును వినియోగించుకునేందుకు తల్లి సాయంతో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చారు. ఆమె ఓటు వేసేందుకు అధికారులు వెంటనే అవకాశం కల్పించారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు వీల్‌చైర్ ద్వారా పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నాడు.

● చిలకలూరిపేట: నియోజకవర్గం పరిధిలో మొత్తం 78.9 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 8,779 మంది కాగా 6,926 మంది గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణానికి చెందిన ఓటర్లకు స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్లో మొత్తం 7పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 4,782మంది ఉండగా 3,403ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 71.16గా నమోదయింది. చిలకలూరిపేట రూరల్ మండలానికి సంబంధించి స్థానిక శారద హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఉన్న మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు 1,298కాగా 1,160 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 89.39గా నమోదైంది. నాదెండ్ల మండల పరిధిలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,614ఓట్లు ఉండగా వాటిలో 1,476ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 91.44గా నమోదైంది. యడ్లపాడు మండల పరిధిలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,085మంది ఓటర్లు ఉండగా 887 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 81శాతం పోలింగ్ నమోదైంది. స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రంలో స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు, మరొక పోలింగ్ కేంద్రంలో శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు వేసేందుకు వచ్చిన నరసరావుపేటలో ఓ దివ్యాంగుడు, వినుకొండలో క్షతగాత్రుడు, బాలింత

● చిలకలూరిపేట: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకం అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్‌లో క్యూలైన్లో నిలబడి ఆయన తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ పూర్తయ్యేవరకు ఆయన చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడులలోని పోలింగ్ కేంద్రాల వద్దకు స్వయంగా వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. ప్రత్తిపాటి వెంట ఎన్నిక పరిశీలకులు పోలంరెడ్డి దినేష్ రెడ్డి, జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 354 బూత్‌లో 185 మంది ఓటర్లకు 148 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 355 కేంద్రంలో 409 మందికి 350 మంది, 356లో 135 మందికి 90 మంది, 357లో 362 మందికి 252 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 1091 మంది ఓటర్లకు గాను 840 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, 77 శాతం పోలింగ్ శాతం నమోదైనట్టు తహసీల్దార్ ఏ సుధాకర్ తెలిపారు. 355 బూత్ వెల్లటూరులో ఓటింగ్ సరళిని తహసీల్దార్ సుధాకర్, రూట్ అధికారి పరిశీలించారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో 365, 365ఏ కేంద్రాల్లో 1012 ఓట్లు ఉండగా 870 ఓట్లు పోలయ్యాయి. 86 శాతం ఓటింగ్ జరిగినట్టు పీవో సాంబశివరావు తెలిపారు.

● నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో పోలింగ్ శాతం 89.71 శాతం నమోదైంది. అధికారులు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 378 పోలింగ్ కేంద్రంలో 795 ఓట్లకు గాను 723 ఓట్లు, 379 పోలింగ్ కేంద్రంలో 819 ఓట్లకు గాను 725 ఓట్లు పోలైనట్టు ఏఈఆర్‌వో, తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. ఎన్నికల పోలింగ్‌ను ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి తదితరులు పర్యవేక్షించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్లలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 368 కేంద్రంలో 564 మందికి 410 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 298 మంది పురుషులు కాగా 112 మంది మహిళలు. అదే విధంగా 369 పోలింగ్ కేంద్రంలో 664 మందికి గాను 399 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 279మంది పురుషులు కాగా 120మంది మహిళలు, మొత్తం 1228మందికి గాను 812మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 66శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ బండి నిర్మల, ఎస్‌ఐ మణికృష్ణ ఏర్పాట్లను, బందోబస్తును పర్యవేక్షించారు.

● ఈపూరు: మండల కేంద్రం ఈపూరు హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో 982మంది ఓటర్లకు గాను 847మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 624మంది, స్త్రీలు 223 మంది ఉన్నారు. సాయంత్రం 6గంటల వరకు ఓట్లు వేస్తూనే ఉన్నారు. ఒక్కటే పోలింగ్ బూత్ కావడంతో ఓటర్లు బాగా ఇబ్బంది పడ్డారు. మహిళలు అసౌకర్యానికి గురయ్యారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు నళిని సందర్శించారు. ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

● యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలోని 380, 381 పోలింగ్ బూత్‌లలో ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4గంటలకు ముగిసింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో నమోదు చేసుకున్న పట్టభద్రుల ఓటర్లు 1,085 మంది కాగా 887 (81.7శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 380 పోలింగ్ బూత్‌లో 505మంది ఓటర్లకు గాను 412మంది, 381 పోలింగ్ బూత్‌లో 580మంది ఓటర్లకు గాను 475మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటలకు 13శాతం మాత్రమే ఓట్లు పోలవ్వగా మధ్యాహ్నం 1.00గంటకు 50 శాతంకు పైగా ఓట్లు పోలయ్యాయి. చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పోలింగ్ బూత్‌లను సందర్శించారు. తహసీల్దార్, ఏఈఆర్వో జయశ్రీ, ఎంపీడీవో హేమలతాదేవి, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పర్యవేక్షించారు. ఎస్‌ఐ బాలకృష్ణ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వినుకొండ అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం అవసరమని, ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిమాలయ గురువు ఆశీస్సులతో గంగాపార్వతి సమేత పరమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీవీ మాట్లాడుతూ బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రకారం వినుకొండ 12 ఆమడల పట్టణం కాబోతుందన్నారు. త్వరలో వినుకొండ కొండపై రామలింగేశ్వరస్వామి దేవాలయం పునఃనిర్మాణంతో ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి వినుకొండలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాగార్జునసాగర్ వలె బొల్లాపల్లి మండలంలో రిజర్వాయర్‌ను నిర్మించి భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో వేయి అడుగు బోర్లు వేసినా నీరురాని పరిస్థితి బొల్లాపల్లి మండలంలో ఉందని, హిమాలయ గురువు ఆశీస్సులతో భూగర్భజలాలు పెరిగాయన్నారు. అనంతరం జీవీతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును హిమాలయ గురువు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

వినుకొండ సబ్‌జైలులో జడ్జి తనిఖీ

వినుకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వినుకొండ సబ్ జైలును ఉమ్మడి గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సయ్యద్ జియా ఉద్దీన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులోని ఖైదీలతో ప్రత్యేకంగా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. జైలులో వండిన వంట పదార్థాలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీలు న్యాయవాదులను పెట్టుకోలేని వారికి న్యాయసేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.మహతి, న్యాయవాది వడ్లమాని అమర్‌బాబు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



వినుకొండ సబ్ జైలును తనిఖీచేసిన సివిల్ జడ్జి సయ్యద్ జియా ఉద్దీన్

చిలకలూరిపేట ఆర్టీసీకి రూ.17.24 లక్షల తిరునాళ్ల ఆదాయం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపో నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు నడిపిన స్పెషల్ బస్సుల ద్వారా రూ.17.24 లక్షల ఆదాయం లభించిందని బస్సు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు గురువారం తెలిపారు. చిలకలూరిపేట కోటప్పకొండ మధ్య 111 స్పెషల్ బస్సులతో 1,326 ట్రిప్పులు నడిపినట్టు ఆయన చెప్పారు. ఈ బస్సులలో సుమారు 50వేల మంది భక్తులు ప్రయాణం చేసినట్లు ఆయన వెల్లడించారు. మధ్యలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులే కుండా బస్సులు నడిపినట్టు ఆయన వివరించారు.

తహసీల్దార్ కార్యాలయంలో జేసీ ఆకస్మిక తనిఖీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే

బొల్లాపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రం బొల్లాపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరు అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు.

కన్నుల పండువగా శివ కల్యాణం

నూజెండ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవ్వవరం వెంకటేశ్వర జగన్మాత పీఠం, రవ్వవరం రామలింగేశ్వరస్వామి, వీ అప్పాపురం కాశీ విశ్వేశ్వర స్వామి, ఐనవోలు శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా వేడుకలు బుధవారం రాత్రి ఉత్సాహంగా నిర్వహించారు. లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణాన్ని పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో అర్చకులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కాలువలో పడిన కాకాని ప్రభ


కాలువలో పడిపోయిన కాకాని ప్రభ

నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్ల నుంచి తిరుగు పయనమైన నరసరావుపేట మండలం కాకాని గ్రామ ప్రభకు గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. ప్రభ కాలువలో పడిపోయింది. ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు. తిరునాళ్లకు కాకాని గ్రామస్థులు భారీ విద్యుత్ ప్రభను నిర్మించారు. తిరునాళ్ల ముగిసిన అనంతరం ఉదయం కోటప్పకొండ నుంచి కాకానికి నిర్వహకులు ప్రభను తరలించే సమయంలో బ్యాలెన్స్ తప్పడంతో ఒక్కసారిగా ఒరిగిపోయింది. ప్రభ పడిపోతున్న సమయంలో తాళ్లు పట్టుకున్న వక్తులు పరుగులు తీశారు. ప్రభ కాలువలో పడిపోవడంతో ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. క్రేన్‌ల సాయంతో కాలువలో పడిపోయిన ప్రభను బయటకు తీసి తిరిగి గ్రామానికి ప్రభను తరలించేందకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నరసరావుపేటలో ప్రభల కోలాహలం


నరసరావుపేటలో కోటప్పకొండ నుంచి తిరిగి వస్తున్న తిరునాళ్ళ ప్రభల కోలాహలం

నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్ళ సందడి పట్టణంలో గురువారం నెలకొంది. తిరునాళ్ళ నుంచి తిరిగి వచ్చే ప్రభలతో ఊరేగింపులు కోలాహలంగా జరిగాయి. డప్పు వాయిద్యాలు, డీజే, తీన్‌మార్ పట్టణంలో మారు మోగింది. ప్రభల ముందు నృత్యాలతో యువకులు సందడి చేశారు. కోటప్పకొండ రహదారి, మల్లమ్మ సెంటర్, పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, ఓవర్ బ్రిడ్జి సెంటర్ ప్రాంతాలలో ప్రభల ఊరేగింపు జరిగింది. సత్తెనపల్లి, ములకలూరు, లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం తదితర గ్రామాలు, పట్టణంలోని పాతూరు, బరంపేట, రామిరెడ్డిపేట, పాలపాడు రోడ్డు, గడియార స్తంభం సెంటర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రభలు తిరునాళ్ళ నుంచి తరలివచ్చాయి. గడియార స్తంభం సెంటర్ నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ఆట వస్తువుల స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. మహాశివుని విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహాశివుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్టాల్స్‌లో వస్తువులు కొనుగోలు చేసేందుకు మహిళలు భారీగా తరలిరావటంతో ఈ సెంటర్ కిటకిటలాడింది. వివిధ సేవా సంస్థలు తిరునాళ్ళ నుంచి తరలి వచ్చిన భక్తులకు అల్పాహారం, తాగునీటిని అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు యాత్రికులతో రద్దీ నెలకొంది. పురపాలక సంఘం చలివేంద్రాలను నిర్వహించింది. ప్రభల ఊరేగింపు పట్టణ వాసులు తిలకించారు. వివిధచోట్ల భక్తులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీరు సేవ సంస్థలు పంపిణీ చేశాయి.

భక్తులకు నరకం చూపిన ట్రాఫిక్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో పోలీసుశాఖ విఫలమైంది. ఎక్కడికక్కడ కొండ రహదారుల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈసారి ట్రాఫిక్ గంటల కొద్దీ స్తంభించింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా గంటకుపైగా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసుశాఖ ముందస్తుగా రూపొందించిన ప్రణాళికను అమలు చేయలేకపోయింది. పెట్లూరివారిపాలెం, వినుకొండ, యలమందల రహదారుల్లో పలు మార్లు ట్రాఫిక్ స్తంభించింది. చిలకలూరిపేట రహదారిలో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుని విలవిలాడారు. పెట్లూరివారిపాలెం రహదారిలో ట్రాఫిక్ జామ్ కావడంతో ఆర్టీసీ బస్సులు కొండకు చేరుకోవడానికి గంటల సమయం పట్టింది. దీంతో బస్సులు దిగిన భక్తులు కాలినడకన కొండకు చేరుకున్నారు. ఘాట్ రోడ్డులో బస్సు బ్రేక్‌డౌన్ కావడంతో బుధవారం రాత్రి బస్సులు నిలిచిపోయి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలు వచ్చాయి. వీఐపీలకు ఉచితంగా బస్సులు ఏర్పాటు చేయడంలో చూపిన శ్రద్ధ టిక్కెట్టు కొన్న సామాన్య భక్తుల విషయంలో కానరాలేదు. పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం భక్తులకు శాపంగా మారింది. వీఐపీ పాసులను ఇబ్బుముబ్బడిగా పోలీసుశాఖ పంపిణీ చేసింది. వేల సంఖ్యలో వీఐపీ కారు పాసులు జారీ చేయడం కూడా ట్రాఫిక్ స్తంభించడానికి ఒక కారణం.



● చిలకలూరిపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో భక్తులకు కనువిందు చేసిన పలు గ్రామాలకు చెందిన 16 భారీ విద్యుత్ ప్రభలు గురువారం రాత్రి ఆయా గ్రామాలకు తిరిగి చేరుకున్నాయి. ప్రభలు తిరిగివచ్చే సమయంలో కోటప్పకొండ చిలకలూరిపేట మధ్య యూటీ జంక్షన్ వద్ద ఉన్న దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ గ్రిడ్‌ను అనుసంధానం చేసే విద్యుత్తు లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రభలు వెళ్లేవరకు అధికారులు అక్కడ మకాం చేసి ప్రభలు వెళ్ళాక సరఫరాను పునరుద్ధరించారు. యూటీ జంక్షన్‌కు సమీపంలో జీడీసీసీబీ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాత్రంతా సుమారు 9వేల మందికి అన్నదానం ఏర్పాటుచేశారు. నరసరావుపేట రోడ్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో కోటప్పకొండ నుంచి తిరిగి వచ్చే భక్తులకు గురువారం పులిహోర పంపిణీ కార్యక్రమం చేశారు.